
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 జనగామ

శనివారం 2 మార్చి 2024



పంటలు ఎండుతున్నాయి

కోపం ఉంటే మాపై తీర్చుకోండి.. రైతులపై కాదు

- మేడిగడ్డ సందర్శనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నిర్లక్ష్యం చేయకుండా పునరుద్ధరించాలని ప్రభుత్వానికి డిమాండ్
- హరీష్‌రావు తదితర నేతలతో కలిసి పర్యటన



అన్నారం బ్యారేజీని పరిశీలిస్తున్న కేటీఆర్

మేడిగడ్డ బ్యారేజీ వద్ద పరిసరాలు పరిశీలిస్తున్న కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి

భూపాలపల్లి/మహదేవపూర్ రూరల్/మహదేవపూర్/కృష్ణకాలనీ, మార్చి 1 : కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వానికి తమపై కోపముంటే తమపైనే చూపాలి కానీ రైతులపై చూపొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా రోడ్డు మార్గాన హైదరాబాద్ నుంచి బస్సులో మేడిగడ్డకు చేరుకున్న కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధుల బృందం బ్యారేజీ ముఖద్వారం నుంచి ప్రత్యేక వాహనాల్లో కుంగిన ప్రాంతానికి వెళ్లారు. పగుళ్లు తేలిన పిల్లరును, కుంగిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టు అంటే మేడిగడ్డ బ్యారేజీ ఒక్కటే కాదని.. వందల కిలోమీటర్ల మేర సొరంగాలు, కాలువలు, పంప్‌హౌజ్‌లు, బ్యారేజీల్లాంటి వంద అంకాలతో కూడుకున్న సాగు, తాగునీటి ప్రాజెక్టు అని వివరించారు. ఇంత పెద్ద ప్రాజెక్టులో ఒకటైన మేడిగడ్డ బ్యారేజీలో చిన్న సమస్య ఎర్పడితే పునరుద్ధరించాల్సిపోయి.. చిల్లర రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. 1.6కిలోమీటర్ల పొడవున్న బ్యారేజీలో 50మీటర్ల మేర సమస్య ఎర్పడితే దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భూతద్దంలో చూపిస్తూ, పనికిరాని ప్రాజెక్టు అని, రూ.లక్షకోట్లు నీటిపాలయ్యాయని ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లసాగర్ తదితర ప్రాజెక్టుల్లో లోపాలున్నా తామెప్పుడూ రాజకీయం చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు చేయించామన్నారు. ఇంజనీరింగ్ నిపుణులు బ్యారేజీ పునరుద్ధరణకు వీలుందని చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. వరదలు ప్రారంభం కాకముందే కాఫర్‌డ్యాం ఏర్పాటు చేసి పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరితో కరీంనగర్ సహా పలు జిల్లాల్లో పంటలు ఎండుతున్నాయన్న కేటీఆర్ సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం సీనియర్ ఇంజనీరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ బ్యారేజీలో సమస్యను గుర్తించి మరమ్మతులు చేపడితే నీటిని నిల్వ చేసి రాష్ట్రానికి సాగునీరందించవచ్చన్నారు. బ్యారేజీలో వచ్చిన సమస్యను పరిష్కరించుకుని భవిష్యత్‌లో జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందన్నారు. మిగతా బ్యారేజీల్లోనూ సమస్యలుంటే వాటిని ముందుగానే గుర్తిస్తే సరిపోతుందన్న ఆయన 93మీ టర్ల వరకు నీటిలెవల్ ఉంచి నీటిని ఎగువకు పంపింగ్ చేసుకోవచ్చని తెలిపారు.



అన్నారం బ్యారేజీ వద్ద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న కడియం శ్రీహరి



మేడిగడ్డ బ్యారేజీ వంతెనపైకి వచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

అన్నారం బ్యారేజీ వద్ద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

- కాంగ్రెస్ తీరుపై కడియం శ్రీహరి, హరీష్‌రావు మండిపాటు

మేడిగడ్డ సందర్శన అనంతరం అన్నారం బ్యారేజీ వద్దకు చేరకున్న బీఆర్ఎస్ నేత బృందం అక్కడ ప్రాజెక్టు అవసరతతో పాటు మరమ్మతులు ఏమేరకు సాధ్యమో వివరించేందుకు పవర్‌పాయింట్ ప్రజెంటే షన్‌ను ఏర్పాటు చేసింది. మాజీ నీటిపారుదల శాఖ మంత్రి, బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ పీపీటీలో ప్రాజెక్టు సమగ్రస్వరూపాన్ని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కడి యం, హరీష్‌రావు తమ పాలనలో చేపట్టిన ప్రాజెక్టులపై కాంగ్రెస్ పార్టీ రాజకీయపరమైె దుర్బు ద్ధితో ఎంపీ ఎన్నికల్లో లబ్ధిపొందడమే లక్ష్యంగా తప్పుడు ప్రచారాలు చేస్తోందంటూ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బ్యారేజీ ఒక్కటే కాదని.. వంద కాంపోనెంట్ల సమాహారమని, ఇదో బృహత్తరమైన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. మూడు బ్యారేజీలు, 15రిజర్వాయర్లు, 19సబ్‌స్టేషన్లు, 21పంప్‌హౌజ్‌లు, 203కిలోమీటర్ల నిడివలో సొరంగాలు, 1531మీటర్ల మేర గ్రావిటీ కాలువలు, 98కిలోమీటర్ల మేర ప్రెజర్ మెయిన్స్, 141టీఎంసీల కెపాసిటీతో రిజర్వాయర్లు, 530మీటర్ల ఎత్తుకు నీటిని పంపింగ్ చేయడం లాంటి కాంపోనెంట్ల ద్వారా మొత్తం 240టీఎంసీల నీటిని వినియోగించుకునే లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టును రీడిజైన్ చేసి నిర్మించినట్టు చెప్పుకొచ్చారు. అయితే కాంగ్రెస్ నేతలు ప్రాజెక్టులో దెబ్బతిన్న పిల్లర్లను మరమ్మతు చేయాల్సింది పోయి రాజకీయ దురుద్దేశాలతో దుష్ప్రచారం తో చేస్తూ ప్రాజెక్టును నిర్వీ ర్యం చేయడం ద్వారా రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. చరిత్రలో అతి తక్కువ అంచనాలతో నిర్మాణం పూర్తయిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరమేనని గణాంకాలు వెల్లడించారు. అలాగే కేటీఆర్ మాట్లాడు తూ ప్రాజెక్టుపై విచారణ నిర్వహించి అవసరమైతే బాధ్యులపై చర్యలు తీసు కోవాలని శాసనసభ వేదికగా తాము ఇప్పటికే తే ల్చిచెప్పామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వా కం కారణంగా కరీంనగర్‌లో పంటలు ఎండిపోతు న్నాయన్నారు. ఇప్పటికైన యుద్ధప్రాతి పాదికన చ ర్యలు చేపట్టి వరదలు వచ్చేలోపు ప్రాజెక్టును పున రుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మదేవేందర్‌రెడ్డి,

▸▸ మిగతా 7వ పేజీలో..

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

అధికారులకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశాలు



పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, మార్చి 1 : శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈ నెల 7 నుంచి 11 వరకు జరిగే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 8న శివ పార్వతుల కల్యాణం జరుగుతుందని, ఆ రోజున విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. గుట్ట పరిసర ప్రాంతంలో మద్యం విక్రయించకుండా నిఘా పెట్టాలని ఎక్సైజ్ శాఖ అధికారులను కోరారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా చూడాలని, పోలీస్ అధికారులను కోరారు. రోడ్డుకిరువైపులా కంప చెట్లను తొలగించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. గుట్ట సమీపంలో భక్తుల కోసం హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్‌ను ఆదేశించారు. సూర్యాపేట, తొర్రూరు, జనగామ, వరంగల్ డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సెకపషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఏసీపీ నర్సయ్య, ఎంపీపీ నాగిరెడ్డి, జడ్పీటీసీ శ్రీనివాసరావు, జడ్పీకోఅప్షన్ సభ్యుడు మదార్, ఎంపీడీవో రాములు, తహసీల్దార్ వెంకటేశం, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సాయి ప్రసన్నకుమార్, ఈవో లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం..

పాలకుర్తి మండలం వావిలాల, మల్లంపల్లి, దర్దెపల్లి, పాలకుర్తి గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.3 కోట్లతో సీసీరోడ్ల పనులను శుక్రవారం ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ప్రారంభించారు. గ్రామాల్లో మట్టి రోడ్లు ఉండకూడదనే ధ్యేయంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉప్పలీల, బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు జల్గం కుమారస్వామి, కమ్మగాని నాగయ్య, పెనుగొండ రమేష్, సలేంద్ర వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర రాలేదని..

మిర్చి బస్తాలకు నిప్పు పెట్టి నిరసన తెలిపిన రైతు

వరంగల్‌టౌన్, మార్చి 1: మిర్చి బస్తాలకు గిట్టుబాటు ధర పలుకలేదన్న బాధతో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో గురువారం రాత్రి ఓ రైతు తన మిర్చి బస్తాలకు నిప్పుపెట్టి నిరసన తెలిపారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం షైలారం గ్రామానికి చెందిన రైతు గుగులోతు జగన్ 24 బస్తాల మిర్చిని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి తీసుకొచ్చాడు. గురువారం పెద్ద ఎత్తున మిర్చి బస్తాలు అమ్మకానికి రావడంతో జగన్ బస్తాలను కొనేందుకు వ్యాపారులు రాలేదు. పక్కన ఉన్న మిర్చి బస్తాలకు పలికిన ధరను చూసిన జగన్ తాను తీసుకువచ్చిన తేజ రకం మిర్చికి గిట్టుబాటు ధర పలుకదేమోనన్న అనుమానంతో గురువారం రాత్రి అసహనంతో మిర్చి బస్తాలకు నిప్పు పెట్టాడు. వెంటనే పక్కనున్న రైతులు తేరుకుని మిర్చి బస్తాలకు అంటుకున్న మంటలను ఆర్పివేశారు. రెండు మిర్చి బస్తాల్లోని మిర్చి స్వల్పంగా దహనమైంది. సమాచారం అందుకున్న మిర్చి యార్డు అధికారులు రైతు వద్ద చేరుకుని భరోసా కల్పించారు. విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. శుక్రవారం ఆ రైతు బస్తాలను తేజ రకం మిర్చి క్వింటాకు రూ.14వేలు, తాలు రకం మిర్చికి 11 వేలకు విక్రయించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో రైతు ఊపిరి పీల్చుకున్నారు.

మేడిగడ్డకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



దేవరుప్పుల నుంచి మేడిగడ్డకు తరలుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

దేవరుప్పుల, మార్చి 1: బీఆర్ఎస్ చేపట్టిన 'చలో మేడిగడ్డ' కార్యక్రమానికి శుక్రవారం మండలకేంద్రంతో పాటు పలు గ్రామాలనుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. జనగామ బైపాస్ వద్ద కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికి వారి వెంట మేడిగడ్డకు తరలారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, మండల నాయకులు బస్వ మల్లేశం, చింత రవి, కొల్లూరు సోమయ్య, సుడిగెల హన్మంతు, మల్లారెడ్డి, దయాకర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

◆ చిలుపూర్: మండలంలోని ఆయా గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు మేడిగడ్డకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో మండలంలోని చిన్నపెండ్యాల, నష్కల్, మల్కాపూర్, శ్రీపతిపల్లి, ఫతేపూర్, పల్లగుట్ట, చిలుపూర్ తదితర గ్రామాల నుంచి మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ మండల, గ్రామశాఖ అధ్యక్షులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూక్య రమేష్‌నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏడవెళ్లి కృష్ణారెడ్డి, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, పోలేపల్లి రంజిత్ రెడ్డి, మామిడాల లింగారెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, జనగామ యాదగిరి, ఉద్దెమారి రాజ్‌కుమార్, తాళ్ళపల్లి సమ్మయ్య పాల్గొన్నారు.

కేటీఆర్‌కు బీఆర్ఎస్ శ్రేణుల స్వాగతం

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి, మార్చి 1: బీఆర్ఎస్ చేపట్టిన 'చలో మేడిగడ్డ' కార్యక్రమానికి వెళుతున్న మంత్రులు, పార్టీ రాష్ట్ర నాయకులకు స్టేషన్‌ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న ఆధ్వర్యంలో వివిధ మండలాల నుంచి నాయకులు శుక్రవారం ఘన్‌పూర్‌కు చేరుకుని మంత్రి కేటీఆర్ వెళుతున్న బస్సుకు ఘన స్వాగతం పలికారు. కార్యకర్తలు భారీ ఎత్తున రావడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో సీహెచ్ నరేందర్ రెడ్డి, రాపోలు మధుసూదన్ రెడ్డి, భూర్ల శంకర్, కోతి రాములు, నాగరబోయిన యాదగిరి, జనగాం యాదగిరి, మాచర్ల గణేష్, ఇల్లెందుల సుదర్శన్, మామిడాల లింగారెడ్డి పాల్గొన్నారు.

అంతకుముందు రఘునాథపల్లిలో జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ, బీఆర్ఎస్ నాయకులు మారజోడు రాంబాబు, వై.కుమార్ గౌడ్, వారాల రమేష్, దొనికెల రమాదేవి,నామాల బుచ్చయ్య, చెంచు రమేష్, వడ్లకొండ శివప్రసాద్, శ్రావణ్, నరేష్ తదితరులు యాత్రకు స్వాగతం పలికారు.

పేలిన బస్సు టైర్

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులకు తప్పిన ప్రమాదం



పేలిన టైరును మార్చుతున్న సిబ్బంది

లింగాలఘణపురం, మార్చి1: బీఆర్ఎస్ తలపెట్టిన చలో మేడిగడ్డ బస్సుయాత్రలో ప్రమాదం తప్పింది. శుక్రవారం హైదరాబాద్ నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ ప్రత్యేక బస్సు టైరు జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల శివారులో అనూహ్యంగా పేలిపోయింది. ఈ సంఘటనతో బస్సులో ఉన్న సుమారు 45 మంది వీఐపీలు, స్టేట్ మీడియా ప్రతినిధులు తీవ్రభయాందోళనకు గురయ్యారు. ముందుగా యాత్ర నెల్లుట్ల బైపాస్ వద్దకు చేరుకోగానే స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో కార్యకర్తలు కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి బయలుదేరిన కొద్ది నిమిషాల్లోనే నెల్లుట్ల శివారులో కాన్వాయ్‌లోని ఏఆర్ 01 టి 0752 బస్సు టైర్ అకస్మాత్తుగా పేలింది. దీంతో వారు ఇతర వాహనాలను సమకూర్చుకుని మేడిగడ్డకు బయలుదేరారు. కాగా ఈ బస్సులో మంత్రులెవరూ లేకపోవడం గమనార్హం.

హామీలను తుంగలో తొక్కిన రేవంత్

పార్లమెంటు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి

మోదీ పాలనలో దేశం సుభిక్షం

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్



విజయ సంకల్ప సభలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

జనగామ టౌన్, మార్చి 1: అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే తుంగలో తొక్కారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ విమర్శించారు. శుక్రవారం జనగామ ఆర్టీసీ చౌరస్తాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అధ్యక్షతన విజయ సంకల్ప సభ నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడ్డాక కేవలం కేసీఆర్ కుటుంబమే బాగుపడిందన్నారు. నియంత పాలనకు ప్రజలు ఓటుతో దిమ్మతిరిగే సమాధానం ఇచ్చారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే ప్రజలకు కష్టాలు మొదలయ్యాయన్నారు. పింఛన్లు, రైతుబంధు లేదని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే కాంగ్రెస్ ముక్కు పిండి హామీలను అమలుచేసేలా చేస్తామన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందన్నారు. కరోనా సమయంలో వెలకట్టలేని సేవలందించిన పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి నెత్తిన పోసుకున్న ఘనత మోదీకే దక్కిందన్నారు. ముప్పై ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమం జరుగుతుంటే ఆ సమస్యకు పరిష్కార మార్గం చూపిన ఏకైక వ్యక్తి మోదీ అని కొనియాడారు. మరోసారి దేశంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ రాగానే కరెంటు కోతలు..

కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి రాగానే కరెంటు కోతలు మొదలయ్యాయని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు, ఆసరా పింఛను రూ.4 వేలు, ప్రతీ మహిళకు రూ.2500 అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ హామీలను ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రద్దయిన నోటుతో సమానమన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీనే గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే కాంగ్రెస్‌కు వేసినట్టేనన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి, సౌడ రమేశ్, ఉడుగుల రమేశ్, కొంతం శ్రీనివాస్, దేవరాయి ఎల్లయ్య, పవన్‌శర్మ, హరీశ్, సంపత్ పాల్గొన్నారు.

కాగా, బీజేపీ సంకల్ప సభకు కేంద్ర మం త్రి నారాయణస్వామి హాజారుకావాల్సి ఉండగా అనివా ర్య కారణాల వల్ల ఆయన రాలేకపోయారని పార్టీ వర్గాలు తెలిపాయి.

త్వరలో ప్రజాపాలన కేంద్రాలు: కలెక్టర్



కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ టౌన్, మార్చి 1: త్వరలో జిల్లాలో ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారం, పథకాల అమలు కోసం ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, మునిసిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఈ సెంటర్లు అందుబాటులో ఉంటాయని, అన్ని పనిదినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. ఆయా సెంటర్లలో ఒక అధికారితో పాటు ఆపరేటర్ ఉంటారని, పోలీసు బందోబస్తుతో సెంటర్ల నిర్వహణ ఉంటుందని అన్నారు. అంతకు ముందు కలెక్టర్ హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతకుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రజా పాలన ద్వారా ప్రజల నుంచి పథకాలకు సంబంధించిన దరఖాస్తులు నిత్యం స్వీకరించాలని సీఎస్ సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షలపై మాట్లాడుతూ.. ఒక నిమిషం ఆలస్యంగా వచ్చిన వారిని సరైన కారణం ఉంటే అనుమతించాలని ఆదేశించారు.

రేపటి నుంచి పోలియో చుక్కలు

ఈ నెల 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ఆవిష్కరించారు. జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలు 48365 మందిని గుర్తించామని, 293 బూత్‌లు ఏర్పాటు చేసి వీరికి పల్స్ పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, ప్రధాన కూడళ్లలో బూత్‌లు ఏర్పాటు చేశారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీదేవి, డీపీఆర్‌వో రాజేంద్రప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం సీపీఎం ధర్నా



బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బచ్చన్నపేట, మార్చి 1: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ సీపీఎం నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ సీపీఎం, ప్రజాసంఘాల పోరాట ఫలితంగా ఇటీవల చిన్నరామన్‌చర్ల గ్రామ శివారు సర్వే నంబర్ 174లో 8-16 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారని, భూమిని పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన 500లకు పైగా కుటుంబాలు ఆందోళనలో పాల్గొని, ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు అందించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. ఆందోళనలో జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, రామగళ్ల అశోక్, బలరాం, పర్వతం నర్సింహులు, అన్నెబోయిన రాజు, వెంకటమ్మ, ఐలయ్య, రాజవ్వ, శోభ, ఈదమ్మ, బుచ్చమ్మ, బాలరాజు, కర్ణాకర్, మనీ, నవనీత, వెంకటయ్య, రవి, బాబు, కవిత తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిస్టర్స్!

పోటీ పరీక్షల్లో సత్తా చాటిన అక్కాచెల్లెళ్లు

ఒక్కొక్కరు మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక..

7లో



అక్కాచెల్లెళ్లు దివ్య, వకుల

జడ్పీ వ్యవస్థ నిర్వీర్యం

నిధుల మంజూరులో కోత ● అరకొర నిధులతో పనులు చేయని దుస్థితి
కార్యాలయ నిర్వహణకు డబ్బులు కరువు ● ఉత్సవ విగ్రహాలుగా జడ్పీటీసీలు

హనుమకొండ టౌన్, మార్చి 1: గత పాలకులు జడ్పీ సెక్టార్‌ను నిర్వీ ర్యం చేశారు. మినీ అసెంబ్లీగా పిలవబడే జడ్పీ సెక్టార్‌కు నిధుల మంజూరులో కోత విధించారు. పలు గ్రాంట్లను నిలిపివేసి అరకొర నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారు. అభివృద్ధి పనులు దేవుడెరుగు కనీసం చాయి, బిస్కెట్లకు నిధులు లేని దుస్థితి జడ్పీ సెక్టార్‌లో నెలకొంది. ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం సాధించి ఉత్సాహంగా జడ్పీలో అడుగుపెట్టిన జడ్పీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారారు. కేవలం మీటింగ్‌లకు రావడం, వారు కొనసాగుతున్న పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడం మినహా వారు చేసే ఘనకార్యం ఏమిలేదు. మరో నాలుగుమాసాల్లో పదవీకాలం పూర్తి కావస్తుండగా గెలిపించిన ప్రజల కోసం పైసా పని చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీనితో జడ్పీటీసీలు ప్రజలకు ముఖం చాటేయాల్సిన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుండటం గమనార్హం. నూతన ప్రభుత్వం ఈ పరిస్థితిని గమనించి జడ్పీలకు పూర్వవైభవం తీసుకురావాలని సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అరకొర నిధులు మంజూరు

జడ్పీ సెక్టార్‌లకు గత పాలకులు అరకొర నిధులు మంజూరు చేశారు. 2019 జూలై మొదటి వారంలో జడ్పీ పాలకవర్గాలు కొలువుదీరాయి. ఈ ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేవలం రూ.5కోట్ల 83లక్షల 22వేల నిధులు మంజూరయ్యాయి. వీటిలో కేంద్రం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2కోట్ల 78లక్షల 39వేలు కాగా, రాష్ట్రం స్పెషల్ గ్రాంట్ క్రింద మంజూరు చేసిన నిధులు రూ.3కోట్ల 48లక్షలు. ఈనిధులు జిల్లాలోని ఏడుగురు జడ్పీటీసీలు, ఇద్దరు కోప్షన్ సభ్యులకు కేటాయిస్తారు. కాగా, వచ్చిన నిధులు 60:40 రేషియోలో పంపకాలు జరుపుకున్నట్లు సమాచారం. 60శాతం 8మంది సభ్యులకు 40శాతం చైర్మన్ కోటా కింద కేటాయింపులు జరుపుకున్నట్లు తెలిసింది. చైర్మన్‌కు కేటాయించిన అదనపు నిధులు అత్యవసరమైన చోట వెచ్చించేందుకు వినియోగిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన ప్రతి జడ్పీటీసీకి వచ్చిన గ్రాంట్ కేవలం రూ.60 లక్షలు మించలేదు. ప్రతీ జడ్పీటీసీ పరిధిలో 20కి పైగా గ్రామాలుంటాయి. వచ్చిన గ్రాంట్ సమానంగా పంపకాలు జరిపితే ప్రతీ గ్రామానికి రూ.3లక్షల నిధులు మాత్రమే వస్తాయి. అరకొర నిధులతో ఎలాంటి పనిచేయలేని జడ్పీటీసీలు ఒకటిరెండు గ్రామాలు ఎంపిక చేసుకుని అందుబాటులో నిధులమేరకు అభివృద్ధి పనులు చేశారు. మిగతా గ్రామాలను గాలికి వదిలేసారు.

చాయ్, బిస్కెట్లకు డబ్బులు లేవు

పాలకులు జడ్పీ సెక్టార్‌లకు నిధులు మంజూరు చేయకపోవడంతో కనీస సౌకర్యాలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జడ్పీలకు మంజూరయ్యే నిధుల నుంచి 5శాతం నిధులు పరిపాలన సంబంధ ఖర్చులకు వెచ్చిస్తున్నారు. సమావేశాలు జరిగినప్పుడు చాయ్, బిస్కెట్లు, స్టేషనరీ, స్వీపర్లకు వేతనాలకు, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. నిధుల మంజూరులో కోత ఏర్పడటంతో యేడాదిగా కరెంటు బిల్లులు చెల్లించడం లేదు. దినసరి ఉద్యోగులకు రెండు మూడు నెలలకు వేతనాలు ఇస్తున్నారు. జడ్పీ కార్యాలయం మెయిన్ రోడ్డు ఆరు కమర్షియల్ కాంప్లెక్స్ ఉండటం, వాటి అద్దెలతో ఖర్చులు కానిస్తున్నారు. మొత్తంగా గతపాలకుల వైఖరితో మినీ అసెంబ్లీగా పిలువబడే జడ్పీ సెక్టార్‌లు ఉనికిని కోల్పోయే దుస్థితి నెలకొనడం విశేషం.

మంజూరైన నిధులు ఇలా..

15వ ఆర్థిక సంఘం నిధులు: 2020-21 సంవత్సరానికి గాను రూ.57,87,000
2021-22 సంవత్సరానికి గాను రూ.93,80,464
2022-23 సంవత్సరానికి గాను రూ.97,24,102
2023-24 సంవత్సరానికి గాను రూ.29,47,730
స్పెషల్ గ్రాంట్: 2021 సంవత్సరానికి గాను రూ.1,73,00,663
స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్: 2022-23 సంవత్సరానికి గాను రూ.1,31,82,907..

అల్లంత దూరం నుంచి పక్షులను చూడడం, చెట్టుపై వాలిన వాటి అందాలను దూరంగా గమనించడం సహజం. అవే పక్షులను దగ్గరగా చూస్తే? వాటి ఆహారం, ఆహార్యం, అలవాట్లను తెలుసుకోగలిగితే..? చింత రావి, తుమ్మ, గంద్ర వెదురు చెట్లపై వాలే ఈ అతిథి విహంగ జీవన క్రమాన్ని అర్థం చేసుకోగలిగితే.. ఎంత బాగుంటోదో కదా.. ఈ సరదా తీరాలంటే వరంగల్‌లోని అమ్మవారిపేట చెరువు వద్దకు వెళితే సరి. ఆహారం, అన్వేషణ, అవాసాలపై జీవించే క్రమంలో ఆయా పక్షుల ప్రత్యేకతను వివరంగా తెలుసుకునే అవకాశం ఈ చెరువు వద్ద కనిపిస్తుంది. పక్షలు కిలకిలరావాలు చెవులకు ఇంపుగా వినిపిస్తాయి. మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.



అరుదైన పక్షుల ఆలవాలం

- వివిధ దేశాల నుంచి వలస వస్తున్న అనేక పక్షులు
- అమ్మవారిపేట చెరువు వద్ద పక్షుల విడిదిగా అనువైన వాతావరణం
- పక్షుల సంరక్షణ కేంద్రంగా చేయాలని ప్రకృతిప్రేమికుల డిమాండ్


కామన్ పేలియా


గ్రీన్ బీటర్


ఎల్లో వ్యాగ్‌టెయిల్

హనుమకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర శివార్లలోని అమ్మవారిపేట ప్రకృతి రమణీయతకు ప్రతీక. చెరువుకు రెండు వైపుల గుట్టలు. మరో వైపు పొలాలు, ఇంకో వైపు నిండుగా నీళ్లతో చెరువు. దాని ఆవరించిన కట్ట. ఎటుచూసినా పచ్చని చెట్లు. నిశ్శబ్దమైన వాతావరణం. చెట్లపై వివిధ రకాల అరుదైన పక్షుల కిలకిలలు, స్థానికంగా ఉండే పక్షులతోపాటు వివిధ దేశాల నుంచి వలస వచ్చిన పక్షలు ఇక్కడ విడిది చేసి ఉండడం కనిపిస్తుంది. సుమారు 100 రకాలు ఇక్కడ దర్శనమిస్తాయి. వీటిలో అత్యంత అరుదైన పక్షులు కూడా ఉన్నాయి. ఇటీవల జంతుశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ జగన్ ఓ అరుదైన పక్షిని గుర్తించి ఫొటోలు తీశారు. ఇలాంటివే మరికొన్ని పక్షులు కూడా అక్కడ ఉన్నాయి. సాధారణంగా ఆయా కాలాల్లో వివిధ ప్రాంతాల నుంచి పక్షులు గుడ్లను పొదగడం కోసం అనువైన ప్రాంతాలను వెతుక్కుంటూ వలస వెళుతుంటాయి. అలాంటి ప్రాంతమే అమ్మవారిపేట చెరువు. పచ్చని చెట్లు, మనుసుకు హాయినిచ్చే ప్రశాంతతకు పెట్టింది పేరు ఈ చెరువు. అనువైన వాతావరణం ఉండడంతో అనేక పక్షులు ఇక్కడికి పెద్దఎత్తున వలస వస్తున్నాయి.

అరుదైన పక్షి

ఇటీవల అత్యంత అరుదైన పక్షి స్పర్ వింగ్డ్-లాప్ వింగ్ అనే పక్షి అమ్మవారిపేట చెరువు వద్ద కంటపడింది. దేశంలో మొట్టమొదటి సారి ఇక్కడే కనిపించడం విశేషం. ఈపక్షి స్వస్థలం ఉత్తర ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, మధ్యదరా ప్రాంతాలు. సాధారణగా ఏ పక్షి రెక్కలకు గోళ్లు ఉండవు. కానీ అరుదైన పక్షి రెక్కలకు గోళ్లు ఉన్నాయి. చిన్నగా, పొట్టిగా ఉండి చూడడానికి చాలా అందంగా కనిపిస్తుంది. ఈ పక్షిని మొట్టమొదటిసారిగా హనుమకొండకు చెందిన జువాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జగన్ గుర్తించారు. పక్షి ఫొటోలను తీశారు. ఇలాంటివే మరికొన్ని పక్షులు కూడా ఇక్కడ సంచరిస్తున్నాయి. ఆయన వాటిని కూడా గుర్తించే ప్రయత్నంలో ఉన్నారు. దీనిని బట్టి సుదూర దేశాల నుంచి పక్షులు ఈ చెరువు వద్దకు వలస వస్తున్నట్టు స్పష్టమవుతోంది.

వంద రకాల పక్షులు

అమ్మవారిపేట చెరువు వద్ద 100 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. వీటిలో స్థానికంగా కనిపించే పక్షులతో పాటు ఇతర దేశాలకు చెందిన అరుదైన, అందమైన పక్షులు కూడా ఉన్నాయి. వేర్ టేయిల్డ్ స్వాలో, బ్లూటేల్డ్ బీ ఈటర్, యూరోసియన్ వేగన్, కామన్ వ్యాగ్ టేయిల్, విష్కర్డ్ టెర్న్స్, బ్లాక్ వింగ్డ్ స్టిల్ట్స్, వైట్ త్రోటెడ్ కింగ్ ఫిషర్, ఎల్లో రాటిల్డ్ లాప్వింగ్, ఎల్లో వ్యాగ్‌టేల్, ఇంటర్మీడియట్ ఎగ్రెట్, స్పాట్ బిల్ః డక్, కామన్ డ్రాంగో, కామన్ ప్రెనియా, సాండ్ పైపర్, డార్టర్ ద స్నేక్ బర్డ్, గ్రే హేరాన్, గ్రీన్ బీ ఈటర్, ప్రింగ్నీ ఊలీడక్స్, నాబ్ బిల్ట్ డక్స్, బిన్ టెల్, గార్గని, యురేపియన్ బీగన్, టఫెడ్ డక్స్, తదితర పక్షులు వీటిలో ఉన్నాయి. కామన్ కింగ్ ఫిషర్, రీడ్ వెబ్లెర్, సిల్వర్ బిల్, ఫెల్‌వోస్ విజిలింగ్ డక్స్ వంటి పక్షులు కూడా వీటిలో ఉన్నాయి.

పక్షుల సంరక్షణ కేంద్రం

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అమ్మవారిపేట చెరువు వద్ద అనేక రక్షా పక్షులు విడిది చేస్తున్నందువల్ల ఈ చెరువును పక్షుల సంరక్షణ కేంద్రంగా మార్చాలని స్థానికులు, పక్షి ప్రేమికులు కోరుతున్నారు. హైదరాబాద్‌లోని అమీన్‌పూర్ చెరువు తర్వాత అత్యధిక సంఖ్యలో వివిధ రకాల పక్షులకు కేంద్రంగా ఉన్న అమ్మవారి పేట చెరువును పక్షుల సంరక్షణ కేంద్రంగా ప్రకటించినట్లయితే మరిన్ని ఎక్కువ పక్షులు ఇక్కడి వచ్చే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. వాస్తవానికి వరంగల్ నగరం, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో పలుచెరువు ఉన్నాయి. ఈ చెరువుల వద్ద కూడా అనేక రకాల పక్షులు మనకు తారసడతాయి. అయితే కబ్జాల కారణంగా ఈ చెరువులన్నీ క్రమంగా కనుమరుగవుతున్నాయి. దీనితో వరంగల్‌లో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. పక్షులన్నీ ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నాయి. అలా కాకుండా కనీసం అమ్మవారి చెరువునా కాపాడానలి ప్రజలు కోరుతున్నారు.

పక్షి ప్రేమికుడు డాక్టర్ జగన్

డాక్టర్ జగన్ పక్షి ప్రేమికుడు. ఏళ్లతరబడి పక్షులపై ఆయన అధ్యయనం చేస్తున్నారు. ఇప్పటికే ఆయన వందర రకాల పక్షులపై లోతైన అధ్యయనం చేశారు. వాటి ఫోటోలను తీసి అల్బమ్‌గా తీసుకువచ్చారు. అమ్మవారిపేట చెరువు వద్ద అరుదైన స్పర్డ్ వింగడ్-ల్యాప్ వింగ్ పక్షిని మొట్టమొదటి సారి గుర్తించింది ఆయనే. జనగామ జిల్లా పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన డాక్టర్ జగన్ 2005నుంచి పక్షలపై అధ్యయనం చేస్తున్నారు. ఉద్యోగరిత్యా హైదరాబాద్‌లో ఉన్నప్పుడు అమీన్‌పూర్ చెరువు, దానిచుట్టుపక్కల ఉన్న పలు అరుదైన పక్షలను గుర్తించారు. వరంగల్ దాని చుట్టుపక్కల ఉన్న చెరువుల వద్ద అనేక రకాల పక్షలు కనిపిస్తాయని అంటున్న ఆయన చెరువులు అంతరించిపోతుండడం వల్ల ఈ పక్షుల ఉనికి ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


డార్టర్ ది స్నేక్ బర్డ్


గ్రే హెరాన్


కామన్ డ్రాగన్


స్పాట్ బిల్ డక్


ఇంటర్మీడియట్ ఎగ్రెట్


సాండ్ పైపర్

నకిలీ సెఫిక్సిన్ విక్రయించొద్దు..

హనుమకొండ, మార్చి 1: నకిలీ సెఫిక్సిన్‌ను మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హనుమకొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జన్ను కిరణ్ కుమార్ హెచ్చరించారు. హైదరాబాద్‌లో నకిలీవిక్రయాలపై ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కమల్‌హాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఔషధ నియంత్రణ శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం విచారణ చేపట్టిందన్నారు. హైదరాబాద్‌లో ఈ నకిలీ మందు విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, పసిగట్టి దాడులు చేపట్టామన్నారు. వీటి మూలాలు ఉత్తరాఖండ్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడడకు వెళ్లి స్థానిక పోలీసుల సహకారంతో వారిని అరెస్టు కూడా చేశామన్నారు. హనుమకొండలో ఇలాంటి నకిలీ విక్ర యాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పది మందికి జరిమానా

హనుమకొండ క్రైం, మార్చి 1: డ్రంకెన్ డ్రైవ్‌లో పది మందికి జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెల్లడించింది. హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేయూ జంక్షన్, పెద్దమ్మగడ్డ, నయీంనగర్, యాదవనగర్‌లో గురువారం రాత్రి పది మందిని అదుపులోకి తీసుకుని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా మద్యం సేవించినట్టు గుర్తించారు. వారికి శుక్రవారం కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రమేష్ పది మందికి రూ.10,700 జరిమానా విధించారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 7 గురు వ్యక్తులకు రూ.7,900 జరిమాన విధించినట్టు సీతారెడ్డి తెలిపారు.

వలంటీర్ల ఎంపిక

హనుమకొండ క్రైం, మార్చి 1: అగ్నిమాపక శాఖకు అనుబంధంగా ప్రకృతి వైపరిత్యాలు సంభవించిన సమయంలో స్వచ్ఛందంగా పని చేసేందుకు వలంటీర్లను ఎంపిక చేస్తున్నట్టు అగ్నిమాపక శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా డివిజన్ అధికాధి మామిడి భగవాన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు 'ఆపద మిత్రుడు - స్వచ్ఛంద సేవకుడు' కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా నుంచి 200 మందిని, హనుమకొండ జిల్లా నుంచి 300 మందిని ఎంపిక చేస్తామని వెల్లడించారు. ప్రకృతి వైపరిత్యాలైన అగ్నిప్రమాదాలు, భూకంపాలు, వరదలు, తుపాన్లు వచ్చిన ప్రాంతాల్లో స్వచ్ఛందంగా పని చేస్తూ ప్రజలకు సేవ చేయాలనే మానవత్వం ఉన్న వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. రెండు జిల్లాల కలెక్టర్ల ఉత్తర్వుల మేరకు ఈనెల 4నుంచి ఎంపికల ప్రక్రియ జరుగుతుందని, 18 నుంచి 40 యేళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కనీసం 7వ తరగతి చదివి సేవాభావం కలిగి ఉన్న వారు అర్హులని వెల్లడించారు. ఎంపిక చేసిన వారికి 12 రోజుల ప్రత్యేక సామగ్రిని అప్పగించి శిక్షణ ఇస్తామని తెలిపారు. అన్ని అగ్నిమాపక కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు 87126 99149, 87126 99305 నెంబర్లలో సంప్రదించాలని భగవాన్‌రెడ్డి సూచించారు.

ఫోన్ లాక్కుని డబ్బు స్వాహా

హనుమకొండ క్రైం, మార్చి 1: బలవంతంగా ఫోన్ తీసుకుని ఫోన్‌లో నుంచి డబ్బులు కాజేసిన వ్యక్తిపై హనుమకొండ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఊకంటి శ్రీనాథ్‌రెడ్డి టైలర్‌స్ట్రీట్‌లో మెడికల్‌షాపులో పని చేస్తున్నాడు. హనుమకొండ సుధానగర్ ప్రాంతానికి చెందిన అనిపర్తి అనితకుమార్ అనే వ్యక్తి కొద్ది రోజుల కిందట పరిచయమయ్యాడు. కిందటేడు ఆగస్టు 28న శ్రీనాథ్‌రెడ్డి పనిచేస్తున్న మెడికల్ షాపునకు అనిత కుమార్ వచ్చాడు. ఫోన్ మాట్లాడేది ఉంది, ఫోన్ ఇవ్వాలని కోరాడు. ఫోన్ ఇవ్వడానికి నిరాకరించడంతో బలవంతంగా ఫోన్‌ను లాక్కుని ఓ లోన్ యాప్ ద్వారా రూ.2.30లక్షలు అనిత్‌కమార్ ఫోన్‌పేకు పంపించుకున్నాడు. డబ్బుల గురించి ప్రశ్నించగా ఇస్తానని జరుపుకుంటూ వచ్చి చివరికి ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితుడు శ్రీనాథ్‌రెడ్డి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో.. పంటలు ఎండుతున్నాయి


టోల్‌గేట్ వద్ద బీఆర్‌ఎస్ నాయకుల కాన్వాయ్‌ని అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు

(5వ పేజీ తరువాయి)

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, జడ్పీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమన్వయలోపంతో ఉద్రిక్తత

బీఆర్‌ఎస్ చలో మేడిగడ్డ కార్యక్రమ నేపథ్యంలో పోలీసుల సమన్వయలోపం స్పష్టంగా కనిపించింది. తొలుత బ్యారేజీ చెక్‌పోస్ట్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను లోనికి అనుమతించిన పోలీసులు కేటీఆర్ పర్యటనకు కొద్ది నిమిషాల ముందు కట్టడి చర్యలు ప్రారంభించారు. అప్పటికే వంతెన సమీపంలోకి చేరుకున్న కార్యకర్తలను పోలీసులు ఆపేందుకు ప్రయత్నించినా వారంతా వంతెన గేటు వద్దకు చేరుకోవడంతో పోలీసులు వంతెన గేటు మూసివేశారు. దీంతో పోలీసులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలకు మధ్య సుమారు అరగంటపాటు వాగ్వాదం జరిగింది. కానీ అక్కడ సరిపడా పోలీసు సిబ్బంది లేకపోవడంతో.. కార్యకర్తలంతా ఒక్కసారిగా గేటును తోసేసి లోనికి దూసుకురావడంతో స్వల్ప తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పలువురు మహిళ కార్యకర్తలు, నాయకులు, పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు ముందు ఓడీ ఎస్పీ స్థాయి అధికారి మీడియాకు అనుమతి ఉందని లోపలికి పంపగా.. మరో డీఎస్పీ స్థాయి అధికారి అడ్డుకోవడం వాగ్వాదానికి దారితీసింది. పోలీసుల సమన్వయలోపాన్ని బయటపెట్టింది. ఇక పోలీసులు అత్యుత్సాహం కారణంగా కేటీఆర్‌తో కలిసి పరిశీలనకు వెళ్లాల్సిన మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రా రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్‌రెడ్డిపాటు ఎంపీ మాలోత్ కవిత, జడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి సహా పలువురు నేతలు ప్రత్యేక వాహనాల్లో కాకుండా నడుచుకుంటూ కుంగిన ప్రాంతానికి వెళ్లారు. మూడు రోజుల ముందే పర్యటనకు సంబంధించిన సమాచారం ఉన్నా ఆస్థాయిలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేయలేదన్న విమర్శలు వినిపించాయి.

ఉద్రిక్తత.. ఉద్విగ్నంగా..

బీఆర్‌ఎస్ చేపట్టిన చలో మేడిగడ్డ కార్యక్రమం ఉద్రిక్తతగా సాగింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్ తెలంగాణ భవన్ నుంచి రెండు బస్సులతో పాటు కాన్వాయ్‌లో వచ్చిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రులు, హరీష్‌రావు, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, మాజీస్పీకర్లు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మదుసూధనచారి, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల బృందానికి జనగామ జిల్లా పెంబర్తి వద్ద స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు ఎరబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌లతో పాటు పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఉదయం 11 గంటలకు పెంబర్తి నుంచి బయలుదేరిన బీఆర్‌ఎస్ నాయకులకు హసన్‌పర్తి మండలం దేవన్నపేట వద్ద కాంగ్రెస్ శ్రేణుల నుంచి నిరసన ఎదురైంది. 'గో బ్యాక్ బీఆర్‌ఎస్.. గో బ్యాగ్ కేటీఆర్ అంటూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నినాదాలు చేసి బీఆర్‌ఎస్ నేతల కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఆ తర్వాత పోలీసుల బందోబస్తు మధ్య కాన్వాయ్ ముందుకు సాగింది. దామెర క్రాస్ వద్ద ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పోలీసుల చేతిలో గాయపడి చికిత్స పొందుతున్న కార్యర్తలను కేటీఆర్ పరామర్శించారు. అక్కడి నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయానికి చేరుకున్న కేటీఆర్ బృందం మధ్యాహ్నం భోజనం అనంతరం 3:30గంటలకు భూపాలపల్లికి బయలుదేరి 4:40కి మేడిగడ్డకు చేరుకున్నారు. అక్కడ పరిశీలన అనంతరం 5.20గంటలకు అన్నారం బ్యారేజీకి వెళ్లారు.

బీఆర్‌ఎస్ నాయకుల అత్యుత్సాహం

పిల్లర్ల పైకి ఎక్కి సెల్ఫీలు

మహదేవపూర్ రూరల్, మార్చి 1: మేడిగడ్డ బ్యారేజీ వద్ద పోలీసులు పట్టించుకోకపోవడంతో బీఆర్‌ఎస్ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రమాదకర ప్రదేశంలో సెల్ఫీలు దిగుతూ కనిపించారు. తొలుత మేడిగడ్డ బ్యారేజీ వంతెనపైకి అనుమతించని పోలీసులు ఆ తర్వాత కార్యకర్తలు నెట్టుకుంటూ రావడంతో వారిని వదిలేశారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు బ్యారేజీ వంతెనపైనే కాకుండా పిల్లర్లపైకి ఎక్కి సెల్ఫీలు దిగారు. సాధారణంగా అధికారులకు మాత్రమే అనుమతి ఉన్నచోట హంగామా చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కనీసం హెచ్చరికలు కూడా జారీ చేయలేదు.


మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్‌పైకి ఎక్కి సెల్ఫీలు దిగుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గెలుపే లక్ష్యంగా..

- కబడ్డీ పోటీలలో స్వర్ణ పతకమే లక్ష్యంగా కసరత్తు
- నేటి నుంచి నాగార్జుసాగర్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు


జేఎన్‌ఎస్ కబడ్డీ కోర్టులో సాధన చేస్తున్న హనుమకొండ జిల్లా కబడ్డీ జట్టు క్రీడాకారులు

హనుమకొండ స్పోర్ట్స్, మార్చి 1: మార్చి 2 నుంచి 4 వరకు నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహించనున్న 70వ అంతర్ రాష్ట్రాల సీనియర్ మెన్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొని స్వర్ణ పతకం సాధించి జిల్లాకు కీర్తి తీసుకరావడమే ధ్యేయంగా హనుమకొండ జిల్లా కబడ్డీ జట్టు క్రీడాకారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన జట్టు క్రీడాకారులు కొంత కాలంగా హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని కబడ్డీ కోర్టులో డీఎస్‌ఏ తాత్కాలిక కోచ్ ఓనపాకల శంకర్ సారథ్యంలో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సాధన చేస్తున్నారు. డీఎస్‌ఏ కోచ్ శంకర్ సారథ్యంలో శిక్షణ పొందుతున్న జిల్లా జట్టు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో సత్తా చాటి స్వర్ణ పతకం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేయాలి..:

ఓనపాకల శంకర్, డీఎస్‌ఏ కబడ్డీ కోచ్

జేఎన్‌ఎస్‌లో కొన్ని క్రీడలకు మాత్రమే అకాడమీలు ఉన్నాయి. గ్రామీణ క్రీడగా ప్రసిద్ధిగాంచిన కబడ్డీ క్రీడాకారులు కోసం అకాడమీ ఏర్పాటు చేయడం ద్వారా మెరికలాంటి క్రీడాకారులను జిల్లాకు అందించవచ్చు. అకాడమీలు నెలకొల్పడం ద్వారా క్రీడాకారులకు మరిన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండడంతో క్రీడల్లో మరింత నైపుణ్యం సాధించవచ్చు. అదే విధంగా కబడ్డీ క్రీడను ఒలంపిక్‌లో చేర్చడం ద్వారా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ లభించే అవకాశం ఉంది. ప్రతీ రోజు సుమారు 30 మంది యువతకు కబడ్డీ క్రీడలో ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ అందిస్తున్న. ఇక్కడ నా వద్ద శిక్షణ పొందిన క్రీడాకారులు ఇప్పటికే పలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో పాల్గొని ప్రతిభ కనబర్చి రాణిస్తున్నారు.

గ్రేట్ 'జాబ్'!

- అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టుల్లో అరుదైన ఫలితాలు
- ఒక్కరికి పలు ఉద్యోగాలు

● ఒకే మహిళకు నాలుగు ఉద్యోగాలు


గట్ల పుష్పలత

కేసముద్రం, మార్చి 1 : కేసముద్రం స్టేషన్‌కు చెందిన గట్ల పుష్పలత తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామక బోర్డు(ట్రిబ్) ఆధ్వర్యంలో నిర్వహించిన నియామక పరీక్షల్లో నాలుగు ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. ఈ నియామక పరీక్షల్లో డిగ్రీ, జూనియర్ లెక్చరర్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) పోస్టులకు ఆమె ఎంపికయ్యారు. కేసముద్రం స్టేషన్‌కు చెందిన స్థానిక జీజేసీ లెక్చరర్ కొత్తకొండ ప్రసాద్‌తో 2009లో వివాహం కాగా, అప్పటికే ఆమె బీఎస్సీ(బీజెడ్సీ), బీఈడీ పూర్తి చేశారు. వివాహం అనంతరం ఆమె భర్త ప్రోత్సాహంతో 2013లో ఎంఎస్సీ(బాటనీ), 2019లో ఎంఏ(తెలుగు) కేయూలో పూర్తిచేసి, జాతీయ అర్హత పరీక్ష(నెట్), రాష్ట్ర అర్హత పరీక్ష(సెట్) అర్హత సాధించారు. 2021లో నియామక పరీక్ష, డెమో, ఇంటర్వ్యూలో గెస్ట్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె వరంగల్ తూర్పు టీఎస్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు పుష్పలతను అభినందించారు.

● అక్కాచెల్లెళ్లకు మూడేసి ఉద్యోగాలు


అక్కాచెల్లెళ్లు దివ్య, వకుల

బచ్చన్నపేట, మార్చి 1: వారిద్దరు అక్కాచెల్లెళ్లు.. పేదరైతు ఇంట్లో పుట్టిన బిడ్డలు. పెళ్లిళ్లు అయినప్పటికీ పట్టు వదలలేదు. మంచి ఉద్యోగం సంపాదించి చదివిన చదువుకు సార్థకత చేకూర్చాలనుకున్నారు. రాసిన మూడు పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని మండల ప్రజలు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన నిమ్మ సక్కుబాయి ఈదిరెడ్డి దంపతులకు వకుల, దివ్య అనే ఇద్దరు కుమార్తెలు. చిన్నప్పటి నుంచి చదువులో ముందుండేవారు. పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం సాగింది. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. వకులను జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్‌కు చెందిన వంటేరు సంపత్‌రెడ్డికి, రెండో అమ్మాయి దివ్యను బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన ఉమ్మెంతల మధుసూదన్‌రెడ్డికిచ్చి వివాహం చేశారు. వకుల గృహిణిగా, దివ్య జనగామ మండలం వెంకిర్యాల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఆగస్టు 2023లో గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కోసం పరీక్షలు నిర్వహించగా, అక్కాచెల్లెళ్లు జనగామలో ఉంటూ ప్రిపేర్ అయ్యారు. ఫిబ్రవరి 14న పీజీటీ, 29న జూనియర్ లెక్చరర్, మార్చి 1న టీజీటీ ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ మూడింటిలోనూ అక్కాచెల్లెళ్లు ఎంపికయ్యారు. దీంతో జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో జాయిన్ అయ్యేందుకు వారు సిద్ధమయ్యారు. కాగా ఒక్క ఉద్యోగం పొందేందుకు నానా తంటాలు పడుతున్న ఈ రోజుల్లో అక్కాచెల్లెళ్లు మూడేసి ఉద్యోగాలకు ఎంపిక కావటంతో వారికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో మరిన్ని పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే ఉంటామని వారు ఆత్మస్థైర్యంతో చెబుతున్నారు.

● దంపతులకు రెండేసి ఉద్యోగాలు


గంధసిరి వెంకటేశ్వర్లు, గీత

కురవి, మార్చి 1: కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన గంధసిరి వెంకటేశ్వర్లు-గీత దంపతులు ఇటీవల విడుదలైన ఉద్యోగ పరీక్షా ఫలితాల్లో రెండేసి ఉద్యోగాలు సాధించారు. గురుకుల ఫలితాల్లో గంధసిరి వెంకటేశ్వర్లు డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికయ్యారు. ఆయన భార్య గీత పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికయ్యారు. భార్యాభర్త రెండేసి పోస్టులకు ఎంపిక కావడం పట్ల మిత్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

● ఒకే వ్యక్తికి మూడు ఉద్యోగాలు

నడికూడ, మార్చి 1 : నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన దొంతుల కృష్ణమూర్తి పట్టుదలతో చదివి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. అయితే ఆయన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కందిగడ్డ తండా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. గురుకుల ఫలితాలల్లో గణిత శాస్త్రం విభాగంలో జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలను సాధించాడు. కాగా, స్వగ్రామం చర్లపల్లిలో కృష్ణమూర్తిని పలువురు అభినందించారు. కృష్ణమూర్తి ఐదుగురు సోదరులు, సోదరి ప్రభుత్వ ఉద్యోగాలు చేయడం గమనార్హం. కృష్ణమూర్తి పదో తరగతి వరకు చర్లపల్లిలో చదువుకున్నాడు. ప్రస్తుతం బీఎస్సీ, బీఈడీ పూర్తి చేశారు.

బయో కెమిస్ట్రీ ఇన్‌చార్జ్ హెడ్‌గా మధుకర్‌రావు

కేయూ క్యాంపస్, మార్చి 1: కేయూ బయో కెమిస్ట్రీ విభాగం ఇన్‌చార్జి హెడ్‌గా డాక్టర్ కె.మధుకర్‌రావును నియామిస్తూ శుక్రవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న జంతుశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ జి.షమిత నుంచి బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2007లో బయోకెమిస్ట్రీ విభాగంలో అధ్యాపకులుగా మధుకర్‌రావు నియమితులు కాగా, ఇప్పటివరకు 30 పరిశోధన పత్రాలను ప్రచురించారు. మధుకర్‌రావు నియామకంపై పలువురు అభినందనలు తెలిపారు.

ఉచిత విద్యుత్ వచ్చేసింది

నెల్లుట్లలో జీరో బిల్లు అందజేసిన ఎన్పీడీసీఎల్ ఎస్ఏవో

వినియోగదారుల్లో ఆనందోత్సాహం



నెల్లుట్లలో జీరో బిల్లును అందజేస్తున్న ఎన్పీడీసీఎల్ అధికారులు

లింగాలఘణపురం, మార్చి1: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీ క్షేత్రస్థాయిలో అమలైంది. జిల్లాలోనే మొట్టమొదటి సారిగా లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో ఎన్పీడీసీఎల్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జయరాజ్ ఆధ్వర్యంలో జీరో బిల్లును శుక్రవారం రాత్రి నలుగురు విద్యుత్ వినియోగదారులకు అందజేశారు. ఇక నుంచి 200 యూనిట్లలోపు మీటర్ రీడింగ్ ఉన్న ప్రతీ వినియోగదారుడికి జీరో బిల్లు వస్తుందని ఎలాంటి బిల్లు చెల్లించాల్సిన పని లేదని స్పష్టం చేశారు. ఫిబ్రవరి మాసానికి చెందిన రీడింగ్‌ను తీసిన ఎన్పీడీసీఎల్ అధికారులు మొదట 164 యూనిట్లను వాడిన లగిశెట్టి మధుసూదన్ కుటుంబానికి రూ.775ల విద్యుత్‌కు జీరో బిల్లును అందజేశారు. దీంతో వినియోగదారుల్లో ఆనందోత్సాహం నెలకొంది. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి, ఏఈ శంకరయ్య, లైన్‌మెన్ నర్సయ్య, జేఎల్ఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో ఉత్సాహంగా మాక్ పోల్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 1: కలెక్టర్ ఆదేశం మేరకు శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లోని హైస్కూళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో మాక్ పోల్ నిర్వహించారు. విద్యార్థులే ఓటర్లుగా, పోలింగ్ సిబ్బందిగా వ్యవహరించి మాక్ పోల్ నిర్వహించారు. ఈవీఎం, వీవీపాట్, ఓటింగ్ కంపార్ట్‌మెంట్, ఓటర్ కార్డు, గుర్తింపు కార్డు తదితర అంశాలపై వివరించారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నీతి, నిజాయితీలకు పట్టం గట్టాలని వివరించారు. స్థానిక విద్యాజ్యోతి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మాక్ పోల్‌ను ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్ కిరణ్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో హైస్కూళ్ల హెచ్ఎంలు ప్రవీణ్‌కుమార్, షరోన్, డాక్టర్ పి.ఎల్లయ్య, బాల శౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్మెట మోడల్ స్కూల్‌లో..

నర్మెట: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం మాక్ ఎలక్షన్స్(నమూనా ఎలక్షన్స్) నిర్వహించారు. విద్యార్థులు ఎన్నికల్లో పోటీదారులుగా, ఓటర్లుగా, ఎన్నికల సిబ్బందిగా, పోలీసులుగా విధులు నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. ఓటరు అర్హత, పోలింగ్ ప్రక్రియ అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ శరత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సీఈవో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పాఠశాలల్లో విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సదానందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో వర్గీకరణ సాధిస్తాం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్
- జిల్లాలో ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం
- నివాళి అర్పించిన నాయకులు



జనగామలో మాదిగ అమరుల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

జనగామ టౌన్, మార్చి 1: మాదిగ అమరుల స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో మాదిగ అమరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ముప్పై ఏళ్లుగా రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. ఈ పోరాటంలో అమరులైన వారి త్యాగాలు మరువలేమన్నారు. వర్గీకరణ సాధనే వారికి నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు సందెన రవీందర్, గద్దల కిశోర్, బొట్ల మహేశ్, చుంచు రాజు, గుర్రం శాంసన్, గందమల్ల ఉదయ్, నీర్మాల భాస్కర్, గువ్వల రవి, క్రాంతిచరణ్, కృష్ణ, అంబేద్కర్, రవి, తేజ, ఉదయ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరుల చిత్ర పటాలకు శుక్రవారం జఫర్‌గడ్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా నేత చింత ఎల్లస్వామి, మండల ఇన్‌చార్జి తాటికాయల హరికృష్ణ మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలుగా రిజర్వేషన్ల వర్గీరణ కోసం పోరాటం సాగిస్తున్నామన్నారు. అమరుల ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రడపాక ఆదాం, తాటికాయల యాకయ్య, మారపల్లి మహేశ్, యాదయ్య, రవి, ఇల్లందుల సోమయ్య, బల్లెపు స్వామి, యాకనాథం, చెరిపల్లి కొమురయ్య, రాములు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నర్మెట: ఎస్సీ వర్గీకరణ పోరులో అమరులైన మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శుక్రవారం నర్మెటలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొంపెల్లి అంబేద్కర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకుడు చుంచు రాజు, జిల్లాకార్యదర్శి కంతి చరణ్, బిచ్చాల వంశీ, రాయరపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిలుపూర్‌లో అమరుల చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఆరూరి శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలోనే తమ కలలు సాకారమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నలిమెల నాగరాజు, జీడి జీవన్, గుర్రం అశోక్, దుర్గయ్య, గాదె పెద్ద యాదగిరి, శ్రీను, రాజయ్య పాల్గొన్నారు.

బచ్చన్నపేట: వర్గీకరణ సాధన కోసం అమరులైన వారికి శుక్రవారం ఎంఆర్పీఎస్ నేతలు నివాళులు అర్పించారు. చిత్ర పటాలకు పూలమాలలు వేసి వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వర్గీకరణ సాధిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్వాల నర్సింగరావు, రాజు, శ్రీనివాస్, లక్ష్మయ్య, మల్లేశం, సిద్దులు, రవి, శ్రీకాంత్, ముత్తయ్య, సిద్దిమల్లు, ప్రవీణ్, అజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: అమరుల త్యాగాలను వృథా కానివ్వబోమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం లింగాలఘణపురంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నాయకులు సందెన రవీందర్, భీమయ్య, ఆగయ్య, యాకయ్య, రాంచందర్ పాల్గొన్నారు.

దేవరుప్పుల: మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలో శుక్రవారం అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు పడమటింటి నర్సింహా, కొంగరి రాములు, బట్ట యాదగిరి, ఏసుపాదం, గిరిబాబు, రవి, ప్రవీణ్, సోమయ్య, అశోక్, సీతమల్లయ్య, ఐలుమల్లు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ ఫైల్స్‌ను త్వరితగతిన పూర్తి చేస్తాం

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



స్టేషన్‌ఘన్‌పూర్‌లో రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 1: ధరణిలో పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌ను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. వివిధ రకాల ఫైల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 9వరకు రెవెన్యూ మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. గతంలో అన్ని సవరణలు కలెక్టర్ చేతిలో ఉండేవన్నారు. ప్రస్తుతం తహసీల్దార్‌కు 4 మాడ్యుల్స్, ఆర్డీవోకు 6 మాడ్యుల్స్, కలెక్టర్‌కు 6 మాడ్యుల్స్ సవరణ చేసే అధికారం ప్రభుత్వం కల్పించిందని అన్నారు. తద్వారా సమస్యలకు తొందరగా పరిష్కారం లభిస్తుందన్నారు. ధరణి దరఖాస్తులను పరిష్కరించడానికి గాను ప్రతీ మండలానికి టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఘన్‌పూర్ మండలంలో 900 ధరణి అప్లికేషన్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని స్పీకింగ్ ఆర్డర్‌లో పరిష్కరిస్తామని అన్నారు. గతంలో ఎందుకు రిజెక్ట్ అయ్యాయో కూడా తెలియపరుస్తామన్నారు. ఈ సందర్భంగా కార్యాలయానికి వచ్చిన ఓ రైతు తన సమస్యను కలెక్టర్‌కు వివరించగా ప్రస్తుతం సమస్య ఆర్డీవో స్థాయిలో పరిష్కారం అవుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐలు అర్జున్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఘన్‌పూర్ పర్యటనకు వచ్చిన కలెక్టర్ శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయం కావడంతో దగ్గరలో ఉన్న మసీదుకు వెళ్లి సామాన్యుల మాదిరిగానే మతపెద్దలతో కలిసి నమాజ్ చేశారు.

ఇంటర్ పరీక్షలకు 95.65% విద్యార్థుల హాజరు

జనగామ కల్చరల్, మార్చి 1: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఫస్ట్‌ియర్ విద్యార్థులకు ఇంగ్లీషు పరీక్ష జరిగింది. విద్యార్థులకు సెట్-బి ప్రశ్నాపత్రం అందించారు. 4597 మంది విద్యార్థులకు గాను 199 మంది గైర్హాజరు కాగా 4398 మంది హాజరుతో 95.65% విద్యార్థులు హాజరైనట్లు డీఐఈవో భైరి శ్రీనివాస్ తెలిపారు. డెక్ సభ్యులు జిల్లా లోని దేవరుప్పుల, కొడకండ్ల పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ నర్మెట, జనగామ లోని బాలికల జూనియర్ కళాశాల, ఏబీవీ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

దేశమంతా మోదీ పాలనను కోరుకుంటోంది

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 1: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు యావత్తు భారతదేశ ప్రజానీకం మోదీ పాలనను కోరుకుంటోందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర శుక్రవారం సాయంత్రం ఘన్‌పూర్‌కు చేరుకోగా బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివాజీ చౌరస్తా వద్ద బహిరంగసభలో ఈటల మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓటు వేసి మోదీని మూడవసారి ప్రధాని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండె విజయరామారావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, రాష్ట్ర నాయకులు తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, ప్రకాశ్ రెడ్డి, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బొజ్జపల్లి సుభాష్, ఇనుగాల యుగేందర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, కేవీఎల్ఎన్ రెడ్డి, గట్టు కృష్ణ, సట్ల రమణ, గంటె ఉపేందర్, రడపాక ప్రదీప్, తాళ్లపల్లి కిశోర్‌గౌడ్, నాగేష్‌గౌడ్ పాల్గొన్నారు.

చిలుపూర్: స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప యాత్రకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్ళారు. బీజేపీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ నేతృత్వంలో తోకల సంపత్‌రెడ్డి, రమేష్, రఘుపతి, దోరం శ్రీనివాస్, రాకేశ్, రజనీకర్, బాల్నె శ్రీనివాస్, రంజిత్ తరలివెళ్లారు.

రైతు రుణమాఫీ ఏమైంది..

పాలకుర్తి: అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడే ఏమైందని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. శుక్రవారం రాత్రి రాజీవ్ చౌరస్తాలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేస్తే మురికి గుంటలో పడేసినట్లేనని అన్నారు. బీజేపీని గెలిపించి మోదీ పాలనను తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్‌రెడ్డి, దంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్, దుంపల సంపత్, మారం రవి పాల్గొన్నారు.

రఘునాథపల్లి: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం మండల కేంద్రానికి విచ్చేసిన మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌ను బీజేపీ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వల్లా ఉపేందర్, మండల అధ్యక్షుడు పుప్పాల వేణు కుమార్, మంద వెంకటేషం యాదవ్, మప్పిడి అనిల్, వల్లాల శ్రీనివాస్, చందర్ నాయక్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువ మరమ్మతుకు నిధులిప్పించండి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇందిరను కోరిన వెంకటాద్రిపేట రైతులు



సింగపురం ఇందిరకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిలుపూర్, మార్చి 1: పూడుకుపోయిన కాలువకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.5లక్షలు ఇప్పించాలని కోరుతూ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిరకు వెంకటాద్రిపేట గ్రామ రైతులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం స్థానిక ఎంపీటీసీ ఎన్నకూస కుమార్ నేతృత్వంలో గ్రామానికి చెందిన రైతులతో పాటు, పార్టీలకతీతంగా నాయకులంతా ఆమెను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ గ్రామ సమీపంలోని పెద్దచెరువుకు దేవాదుల నీటిని తరలించే ప్రధాన కాలువను రెండేళ్ళుగా వినియోగించకపోవడంతో మట్టితో కూరుకుపోయిందన్నారు. ప్రస్తుతం రబీసాగుకు దేవాదుల నీళ్ళు అవసరం ఉన్నందున కాలువకు మరమ్మతులు చేపట్టేందుకు గాను నిధులు మంజూరు చేయించాలని కోరగా, ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కందుల రఘుపతి, గాదె జయపాల్‌రెడ్డి, మంతెన లవన్, దేవి తిరుపతిరెడ్డి, కొడిశాల రవి, పవన్, గుర్రం సంపత్, తోకల వెంకట్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనులు ప్రారంభం



బచ్చన్నపేటలో పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ రాధ

బచ్చన్నపేట, మార్చి 1: బచ్చన్నపేట బీడీ కాలనీలో శుక్రవారం ఎంపీ నిధులు రూ.5 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను ఎంపీటీసీ అల్వాల రాధ ఎల్లయ్య, ఎంపీడీవో రఘురామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నేతలు నల్లగోని బాలకిషన్‌గౌడ్, మాసపేట రవీందర్‌రెడ్డి, దిడిగ రమేశ్, జంగిటి విద్యానాథ్, మేకల రాజు, దేవరకొండ రమేశ్, అల్వాల నర్సింగరావు, బుచ్చిరాజు, నర్సింగరావు, కృష్ణ, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సంకల్పయాత్రకు బచ్చన్నపేటలో ఘనస్వాగతం



బచ్చన్నపేటలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

బచ్చన్నపేట, మార్చి 1: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం బచ్చన్నపేటలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కొమురవెల్లి నుంచి చేర్యాల మీదుగా వెళుతున్న యాత్రకు బచ్చన్నపేట వద్ద బీజేపీ శ్రేణులు స్వాగతం పలికాయి. బీజేపీ నేత, మాజీ ఎంపీ బూరనర్సయ్యగౌడ్ తదితరులకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సన్మానించారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని కావటం కోసం ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలువాలన్నారు. ఇందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, దొంతుల చంద్రమౌళి, జూకంటి గణేశ్, పెండెం నగేష్, గద్ద రాజు, సందెల రాము, గీస సందీప్ తదితరులున్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాలరాజు కుటుంబానికి రూ.60వేలు అందిస్తున్న స్నేహితులు

నర్మెట, మార్చి 1 : ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ముక్కెర బాలరాజు కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. నర్మెటలో 2003-04లో పదో తరగతిలో కలిసి చదువుకున్న మిత్రులు తలా కొంత డబ్బులను పోగు చేసి రూ. 60 సమకూర్చారు. వాటిని శుక్రవారం బాలరాజు భార్య, ఇద్దరు కుమార్తెలకు అందించారు. మేమున్నాం అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. సాయం అందించిన వారిలో కాసాని ఆంజనేయులు, బిజ్జ గోవర్ధన్, కూరపాటి శ్రీనివాస్, ప్రజ్ఞాపురం రాజేష్, ఎర్ర శ్రీను, చల్ల సందీప్, ప్రజ్ఞాపురం ఆంజనేయులు, పులి నరేష్, ప్రవీణ్, రామకృష్ణ, శ్రీనివాస్, నర్సింహులు, రాజు, రాజేష్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిలుపూర్, మార్చి 1: మండలంలోని పల్లగుట్టలో అనారోగ్యం కారణంగా మృతిచెందిన ఇసురం లచ్చమ్మ(80) కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, చిలుపూర్ ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు శుక్రవారం సందర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. భవిష్యత్తులోనూ బాధిత కుటుంబానికి అండగా ఉంటానని వారికి భరోసానిచ్చారు.

ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు ఎనగందుల రత్నాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చల్లారపు శ్యామ్‌సుందర్ రెడ్డి, బత్తిని శ్రీను, పేరాల సుధాకర్, వెంకట్‌రెడ్డి, చొక్కయ్య, జీడి ఆనందం, అశోక్‌పాల్, దార రమేష్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..

జఫర్‌గడ్, మార్చి 1 : మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పాలనా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠ్యాంశాలు బోధించి ఆకట్టుకున్నారు. హెచ్ఎంగా శవనబోయిన వరుణ్‌తేజ్, ఉపాధ్యాయులుగా తరాల లాస్య, తేజస్విని, నైనిక, సృజన, మణికంఠ, గౌతంకృష్ణ, పార్థు, గణేష్, దివ్యశ్రీ, సాత్విక్, యశ్వంత్, ప్రణయ్, రితిక, హరీష్, తదితరులు వ్యవహరించి ప్రశంసలందుకున్నారు. హెచ్ఎం సుధాకర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఉపాధ్యాయులు సిహెచ్.రాణి, పి.రాజిరెడ్డి, కె.రాజేంద్రం పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండలంలోని కేశిరెడ్డిపల్లి పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. డీఈవోగా శ్రీకర్, ఎంఈవోగా అనిష్‌చారి, హెచ్ఎంగా సంకీర్తన, ఉపాధ్యాయులుగా సృజన, సిరి, వర్షిత, అశ్వత్ వ్యవహరించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కేశవరావు, ఉపాధ్యాయుడు సత్తిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



జఫర్‌గడ్ మండలం హిమ్మత్‌నగర్ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం



బచ్చన్నపేట మండలం కేశిరెడ్డిపల్లి పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం

మిర్చి ధరలు తగ్గించారని.. రైతుల ఆందోళన

మానుకోట వ్యవసాయ మార్కెట్‌లో ఘటన

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 1: తేజ రకం మిర్చి ధరలు అమాంతం తగ్గించడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ ఎదుట ధర్నా చేపట్టారు. పోలీసులు రంగప్రవేశం చేసి రైతులను శాంతింప చేయడంతో ఆందోళనను విరమించారు. ఈ సంఘటన మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం జరిగింది. మహబూబాబాద్ మార్కెట్‌లో మధ్యాహ్నం 2 గంటల తర్వాత మిర్చి ధరల జాబితాను ప్రకటించారు. వ్యాపారులు ఒక్కసారిగా ధరలు తగ్గించడంతో రైతులు ఆందోళన చెంది మార్కెట్ కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... అత్యధికంగా మిర్చిని రూ.15వేల నుంచి రూ.19వేల వరకు వ్యాపారులు కొనుగోలు చేశారని తెలిపారు. తాలు రకం మిర్చిని రూ.7వేల నుంచి రూ.9వేల లోపే కొనుగోలు చేశారన్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సింగిల్ బిడ్ ధర వచ్చినా కూడా ఆమోదం చెబుతున్నారని ఆరోపించారు. ముగ్గురు, నలుగురు వ్యాపారులు రేట్లు వేస్తే రైతులకు ధర పెరిగేదని, ఒక్క బిడ్ వేసిన వ్యాపారికే మిర్చి కొనుగోళ్లు ఇవ్వడం అన్యాయమని ప్రశ్నించారు. రైతులు మార్కెట్ కార్యాలయం గేటు ముందుకు వెళ్లి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న డీఎంవో ఎం.వెంకట్‌రెడ్డి, సీఐ దేవేందర్, ఎస్సైలు రాణాప్రతాప్, శివ సిబ్బందితో రైతుల వద్దకు వచ్చి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. మార్కెట్‌లో శుక్రవారం మిర్చికి క్వింటాకు గరిష్ఠ ధర రూ.20,601, కనిష్ఠ ధర రూ.15,300, సగటున రూ.19,200 వరకు ధర పలికింది. తాలుకు గరిష్ఠ ధర రూ.10,625, కనిష్ఠ ధర రూ.7వేలు పలికాయి. కేసముద్రం మార్కెట్‌లో తేజ రకం మిర్చికి గరిష్ఠ ధర రూ.20,118, కనిష్ఠ ధర రూ.8వేలు, సగటున రూ.19,399 ధరలు పలికాయి.

ధరణి సమస్యలపై అవగాహన సదస్సు

బచ్చన్నపేట, మార్చి 1: ధరణికి సంబంధించిన భూసమస్యలపై అవగాహన పెంచుకుని, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చే దిశగా పనిచేయాలని తహసీల్దార్ విశాలాక్షి సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గతంలో భూసమస్యలకు సంబంధించి ఆన్‌లైన్‌లో 723 మంది దరఖాస్తులు చేసుకున్నారని, వీటికి సంబంధించి క్షేత్రస్థాయి విచారణ జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు.